సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 1 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు పలికాయి. మార్కెట్‌కు 785 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.29

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.29, కనిష్టంగా రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

$34.3^\circ/23.1^\circ$

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

- తొలిరోజే వందశాతం పూర్తికి చర్యలు

మడకశిర: జిల్లా వ్యాప్తంగా గురువారం వంద శాతం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు. జిల్లాలో 2,70,853 మంది పింఛన్‌దారులుండగా, ప్రభుత్వం రూ.116.19 కోట్లు విడుదల చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం ఉదయం 5 గంటల నుంచే పింఛన్ పంపిణీని ప్రారంభించేందుకు సచివాలయ సిబ్బంది బుధవారం సాయంత్రానికే బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకున్నారన్నారు. గ్రామాల్లో లేని వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ముందుగానే తెలియజేశామన్నారు.

పెనుకొండ డీఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు



ఆర్ల శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: పెనుకొండ డీఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బదిలీ చేసిన డీజీపీ... నెల్లూరు ఎస్బీ డీఎస్పీగా ఉన్న ఆర్ల శ్రీనివాసులును పెనుకొండకు బదిలీ చేశారు. ఇక్కడ డీఎస్పీగా ఉన్న బాజీజాన్ సైదాను, అలాగే పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్‌ను పోలీసు హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక అనంతపురం పీటీసీలో పనిచేస్తున్న డీఎస్పీ కె. వెంకటేశ్వర రావు తూర్పు గోదావరి దిశా ఉమెన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అప్పా డీఎస్పీ జి.హుస్సేన్ పీరా (పీటీసీ అనంతపురం) జమ్మలమడుగు డీఎస్పీగా బదిలీ అయ్యారు. గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, కళ్యాణదుర్గం డీఎస్పీ బి. శ్రీనివాసులను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, గతంలో పెనుకొండ సబ్ డివిజన్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన ఆర్ల శ్రీనివాసులుకు ఈప్రాంతంపై అవగాహన ఉంది. గతంలో సోమందేపల్లిలో ఓ సంచలనాత్మక కేసును ఛేదించిన శ్రీనివాసులు మంచి పేరు తెచ్చుకున్నారు. తాజా బదిలీల్లో ఆయన పెనుకొండ సబ్ డివిజన్‌కు అధికారిగా వస్తున్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీటి చేరిక కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 74,095 క్యూసెక్కులుగా నమోదవుతోంది. కాలువలకు వదిలే నీటితో కలిపి అవుట్ ఫ్లో 1,32,760 క్యూసెక్కులుగా ఉంది. డ్యాం 33 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 99.040 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631.30 అడుగులకు నీరు చేరింది.

చిత్రవధ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు ఆదాయ మార్గాలను అన్వేషించారు. కళ్లముందే కనిపిస్తున్న సహజ వనరులను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో చిత్రావతి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పేరుతో జనం చెవిలో పువ్వు పెట్టగా, కూటమి నేతలు మాత్రం చిత్రావతిని చెరబట్టి ఇసుకను తవ్వి సరిహద్దులు దాటించేస్తున్నారు. ఒక్కో టిప్పర్ ఇసుకను రూ.60 వేల లెక్కన విక్రయిస్తూ రూ.కోట్లు సంపాదిస్తున్నారు.

- చిత్రావతి నదిని చెరబట్టిన టీడీపీ నాయకులు
- బత్తలపల్లి సమీపంలో నది నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు
- యంత్రాలతో పగలు, రాత్రి తోడేస్తున్న వైనం
- ఒకచోట డంప్ చేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా
- చోద్యం చూస్తున్న అధికారులు



డంప్ చేసిన ఇసుక



చిత్రావతిలో ఇసుకను అక్రమంగా తవ్వుతున్న దృశ్యం



టిప్పరులో తరలుతున్న ఇసుక

ధర్మవరం: ఇసుక ఉచితమంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం హోరెత్తిస్తుండగా... ఆ పార్టీల నాయకులు మాత్రం ఇసుక నుంచి డబ్బు పిండుకుంటున్నారు. అక్రమ తవ్వకాలతో నదులను చెరబడుతున్నారు. బత్తలపల్లి మండలంలో చిత్రావతి నది విస్తరించి ఉండగా.. మండల పరిధిలోని నల్లబోయిన పల్లి వద్ద ప్రభుత్వం ఇసుక ర్యాంప్ ఏర్పాటు చేసింది. నదిలో సేకరించి డంప్ చేసిన ఇసుకను ర్యాంప్ వద్ద టన్ను రూ.277 ప్రకారం ప్రజలకు విక్రయిస్తున్నారు. టీడీపీ నాయకులు మాత్రం ఇసుక ర్యాంప్‌తో పని లేకుండా ఇసుకను అక్రమంగా తవ్వుకుని సరిహద్దులు దాటించి జేబులు నింపుకుంటున్నారు.

యంత్రాలతో తవ్వకాలు..

బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి, గరిశలపల్లి, చిత్రావతి బ్రిడ్జి సమీపంలోని పరీవాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు భారీగా సాగుతున్నాయి. టీడీపీ నాయకులు జేసీబీలు, హిటాచీలను ఉపయోగించి రాత్రి, పగలు అన్న తేడా లేకుండా అక్రమంగా తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్ల ద్వారా కోడెకండ్ల వద్ద జాతీయ రహదారి సమీపంలో డంప్ చేస్తున్నారు. ఆ తర్వాత డంప్ చేసిన ఇసుకను రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒక్కో టిప్పర్ ఇసుకను రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

నియోజకవర్గమంతా ఇదే పరిస్థితి..

జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మరో ఇసుక రీచ్ సీసీ రేవు వద్ద కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ముదిగుబ్బ మండల చిత్రావతి పరిసర ప్రాంతాల్లో సైతం టీడీపీ నాయకులు ఇసుకను అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ధర్మవరం మండలంలోని తుంపర్తి వద్ద ఏకంగా తాగునీటి పైప్‌లైన్ కనిపించే విధంగా స్థానిక టీడీపీ నాయకులు ఇసుక తవ్వకాలు సాగించారంటే పరిస్థితి ఎంతలా దిగజారుతోందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వంలో నిల్వ ఉంచిన వేలాది టన్నుల ఇసుకను నల్లబోయినపల్లి, సీసీ రేవు ఇసుక రీచ్‌ల వద్ద టీడీపీ నాయకులు అనధికారికంగా విక్రయించినట్లు ఆరోపణలున్నాయి. ఇది చాలదన్నట్లుగా బహిరంగంగానే ఇసుకను అక్రమంగా తవ్వుకుని సొమ్ము చేసుకుంటుండటంతో జనం పెదవి విరుస్తున్నారు. టీడీపీ నేతల ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు..

గత ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు 'సెబ్' (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. అక్రమార్కుల ఆట కట్టించింది. దీంతో అప్పట్లో ఇసుక అక్రమ రవాణాకు అవకాశమే లేకుండా పోయింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. 'సెబ్' సైతం పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండగా...ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. జాతీయ రహదారికి ఆనుకునే ఇసుకను అక్రమంగా డంప్ చేస్తున్నప్పటికీ అటు సెబ్ అధికారులు గానీ, ఇటు పోలీసులు గానీ పట్టించుకోకపోవడం గమనార్హం.

8న ఎస్‌ఎంసీ ఎన్నికలు

- ఎన్నికల షెడ్యూలు విడుదల... నేడు నోటిఫికేషన్
- 8న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక, అదేరోజు తొలి సమావేశం

పుట్టపర్తి: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ఈనెల 8న నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ మీనాక్షి బుధవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. గురువారం (నేడు) ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటరు జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారు. 5న 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటర్ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 3 గంటలకు తుది ఓటరు జాబితా ప్రదర్శిస్తారు. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తారు. సభ్యులు 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. 2 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 3 నుంచి 3.30 గంటల వరకు తొలి ఎస్ఎంసీ మీటింగ్ నిర్వహిస్తారు. అన్నిచోట్లా తమకు అనుకూలమైన వారే ఉండేలా అధికార పార్టీ వ్యూహం రచిస్తోంది.

ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులు..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ప్రతి తరగతి నుంచి ముగ్గురు ఎస్ఎంసీ సభ్యులను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు సామాజికంగా వెనుకబడిన వర్గాలు, మరొకరు బలహీనవర్గాల వారు ఉండాలి. అలాగే వీరిలో ఒక మహిళ కచ్చితంగా ఉండాలి. ఒక తరగతిలో 6 కంటే విద్యార్థులు తక్కువ ఉంటే ఆ సంఖ్యను తదుపరి తక్కువ లేదా అంతకంటే ఎక్కువ తరగతిలో కలపాలి. స్థానిక సంస్థల్లో ప్రాతినిథ్యం వహిస్తున్నవారు, హెచ్ఎం, టీచర్లు అనర్హులు. ఎన్నికల ప్రక్రియను ప్రధానోపాధ్యాయులు నిర్వహిస్తారు. హెచ్ఎం లేనిచోట ఇన్‌చార్జ్ టీచరు, జీపీఎస్ స్కూళ్లలో పాఠశాల అధిపతిగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న సీఆర్టీఎస్ కన్వీనర్‌గా వ్యవహిస్తారు.

పింఛన్‌దారులపై 'ఒక్కరోజు' పిడుగు

- 1వ తేదీ తీసుకోకపోతే సొమ్ము వెనక్కు
- బెంబేలెత్తుతున్న లబ్ధిదారులు
- ఎగ్గొట్టేందుకు చంద్రబాబు సర్కారు కుట్ర చేస్తోందని ఆవేదన
- జూలైలో వందల మందికి ఇవ్వకుండా అడ్డుకున్న 'తమ్ముళ్లు'



సాక్షి, పుట్టపర్తి

అధికారంలోకి రాగానే పెంచిన పింఛన్ ఇస్తామంటూ ఊరూరా ప్రచారం చేసిన చంద్రబాబు... పీఠంపై కూర్చున్నాక పింఛన్ ఎగవేతకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పింఛన్ పంపిణీ 'ఒక్కరోజే' అంటూ మెలిక పెట్టాడు. దీన్నిబట్టి చూస్తే పెంచిన మొత్తం ఇవ్వలేక.. ప్రతి నెలా కొంతమందిని కోత వేసేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే పింఛన్‌ల పంపిణీపై ఆంక్షలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. గత నెలలో కేవలం రెండు రోజుల్లోనే పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించగా, వందల మందికి పింఛన్ సొమ్ము అందలేదని బాధితులు చెబుతున్నారు. ఇంకొందరికి టీడీపీ నాయకులు కుట్రలు చేసి ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదు రోజుల పాటు వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే పింఛన్ అందజేసేదని, ఇప్పుడూ అదే విధానం కొనసాగించాలని కోరుతున్నారు.

గత ఐదేళ్లలో కొత్తగా 54 వేల మందికి పింఛన్

గత వైఎస్ జగన్ సర్కార్...ఐదేళ్ల కాలంలో అదనంగా 54 వేల మందికి పింఛన్ అందించింది. చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి జిల్లా పరిధిలో 2,14,843 మంది పింఛన్‌దారులుండగా, 2024 జూన్ 1 నాటికి పింఛన్‌దారుల సంఖ్య 2,73,620కు పెరిగింది. అర్హత పొందిన ప్రతి వారికీ విడతల వారీగా పింఛన్ల జాబితాలోకి చేర్చారు. అలాగే లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి పింఛన్ మొత్తం అందించేవారు. ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరితే వలంటీర్లు అక్కడికే వెళ్లి సొమ్ము అందజేసేవారు. కాగా గత నెలలో రెండు రోజులకు కుదించడంతో పలు కారణాల రీత్యా స్వగ్రామాలకు రాలేని చాలామంది పింఛన్ సొమ్ము అందుకోలేక పోయారు. కాగా ఈసారి ఒక రోజుకే కుదించడంతో మరింత మందికి పింఛన్ మొత్తం అందకుండా పోయే ప్రమాదం ఉంది.

వందల మందికి ఇవ్వలేదు



గత నెలలో రామగిరి మండలంలో మూడు పంచాయతీల్లో 210 మందికి పింఛన్ అందకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. అందరూ కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తే.. వచ్చే నెలలో ఇస్తామని చెప్పారు. ఈ నెలలో ఒక్కరోజే అంటూ మెలిక పెట్టారు. ఇది పింఛన్‌దారులపై చేస్తున్న కుట్రనే.

– వెంకటరెడ్డి, సర్పంచ్, రెడ్డివారిపల్లి

చంద్రబాబు నేతృత్వంలోనే కుట్ర



పెంచిన పింఛన్ ఇవ్వలేక.. సంఖ్యను తగ్గించుకునేందుకు చంద్రబాబు చేస్తున్న కుట్రగా తెలుస్తోంది. పింఛన్ల పంపిణీపై టీడీపీ కార్యకర్తలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాము చెప్పిన వారికే పింఛన్ సొమ్ము అందజేయాలనే షరతు విధిస్తున్నారు. గత నెలలో చాలా మందికి పింఛన్ అందకుండా చేశారు.

– బోయ రామాంజనేయులు, రామగిరి

పాత విధానమే కొనసాగించాలి



పింఛన్ల పంపిణీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఐదు రోజుల విధానమే కొనసాగించాలి. ఒక్కరోజు మెలిక పింఛన్‌దారులకు పథకం అందకుండా చేయడంతో పాటు వచ్చే నెలలో జాబితా నుంచి పేరు తొలగించేందుకు చేస్తున్న కుట్రలో భాగంగా చెప్పవచ్చు. పింఛన్‌దారుల తరపున పోరాటాలకు సిద్ధం అవుతాం.

– గోసె నాగార్జున, రామగిరి జెడ్పీటీసీ సభ్యుడు

'ఆప్కాస్' ఉద్యోగుల తొలగింపు

- పెనుకొండ ఎంజేపీ స్కూలులో 10 మంది ఉద్యోగులు ఇంటికి
- మంత్రి లోకేష్‌కు విన్నవించుకున్నా జరగని న్యాయం



ఉద్యోగులు వెళ్లిపోయాక చాలా సేపు హాస్టల్ బయటే ఉండిపోయిన విద్యార్థులు

పెనుకొండ: నోటిఫికేషన్‌లు ఇస్తాం...ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామంటూ ఎన్నికల వేళ గొప్పలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగులనూ ఇంటికి పంపుతున్నారు. ఆప్కాస్ (ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్) పరిధిలో స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఏళ్లుగా పనిచేస్తున్న 10 మంది (నాన్ టీచింగ్) ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ప్రిన్సిపాల్ సదరు ఉద్యోగులను బుధవారం రిలీవ్ చేశారు.

8 ఏళ్లుగా ఉద్యోగం చేసినా...


మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మురళి, అశోక్‌రెడ్డి, హరిత, సుబ్రహ్మణ్యం, నూర్‌బాబా, అనిత, భారతి, రామాంజనేయులు, మయూరి, లక్ష్మి, నరసమ్మ, శాంతమ్మ తదితరులు వివిధ హోదాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారూ ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. అందువల్లే గత వైఎస్ జగన్ సర్కార్ కూడా వీరికి ఉద్యోగ భద్రత కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని తొలగించేందుకు సిద్ధమైంది. ఈక్రమంలో కొందరు టీడీపీ నేతలు ఇటీవల ఆప్కాస్ ఉద్యోగులకు ఫోన్ చేసి వెంటనే ఉద్యోగాల నుంచి తొలగిపోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారు. దీంతో వారంతా మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమను ఉద్యోగం నుంచి తొలగిస్తే తమ కుటుంబాలు వీధిన పడతాయని వాపోయారు. దీంతో మంత్రి లోకేష్... ఉద్యోగాల నుంచి తొలగించే ప్రసక్తే లేదని వారికి భరోసా ఇచ్చారు. అయినా వారిని విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

కన్నీరు పెట్టిన విద్యార్థులు..

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం స్కూల్ నుంచి వెళ్లిపోతుంటే పలువురు విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు. ఏళ్లుగా తమకు ఎంతో సహకారం అందించిన వారంతా ఇలా ఉన్నట్టుండి వెళ్లిపోతుంటే విద్యార్థులు తట్టుకోలేకపోయారు. ఇకనుంచి వారు పాఠశాలకు రారని తెలిసి చాలా మంది కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్యోగులు కూడా తీవ్ర భావోద్వేగంతో అక్కడి నుంచి వెళ్లారు.

వచ్చి వెళతారా.. వరాలిస్తారా..?

- సీఎం పర్యటనపై సర్వత్రా ఆసక్తి
- గతంలో మడకశిరకు మేలు జరిగేలా జగన్ సర్కార్ చర్యలు
- కృష్ణా జలాలు తీసుకురావడం, ఎంజీసీకి నిధుల మంజూరును గుర్తు చేస్తున్న జనం
- తాజా పర్యటనలో చంద్రబాబు ఏమి వరాలిస్తారోనని ఎదురుచూపు



మడకశిర: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం తలపెట్టిన మడకశిర నియోజకవర్గ పర్యటన ఈ ప్రాంత వాసుల్లో ఆసక్తి రేపుతోంది. సామాజిక పింఛన్ల పంపిణీ చేసేందుకు వస్తున్న సీఎం చంద్రబాబు...పింఛన్ సొమ్ము పంపిణీకే పరిమితమవుతారా...? లేక ఈ ప్రాంత సమస్య పరిష్కారంపై మాట్లాడతారా..అన్న దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. సీఎం పర్యటన నియోజకవర్గ అభివృద్ధికి దోహదం చేస్తుందని టీడీపీ నేతలు చెబుతుండగా... పార్టీ పటిష్టానికే చంద్రబాబు వస్తున్నారని జనం అంటున్నారు.

జగన్ హయాంలో భారీ మేలు..

వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు 2019 నుంచి వరుసగా నాలుగుసార్లు మడకశిరకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను విడుదల చేశారు. రెండుసార్లు మడకశిర చెరువును పూర్తి స్థాయిలో నింపారు. అదే విధంగా అమరాపురం వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లడానికి వీలుగా రూ.2.31 కోట్లతో హంద్రీనీవా కాలువను తాత్కాలికంగా సిద్ధం చేశారు. నియోజకవర్గానికి మేలు జరిగేలా పెనుకొండ నుంచి మడకశిరకు కృష్ణా జలాలు అందించడానికి బైపాస్ కెనాల్ మంజూరు చేశారు. రూ.214.85 కోట్లతో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు. గుడిబండ మండలంలోని మదిగుబ్బ, రొళ్ల మండలంలోని రత్నగిరి వద్ద హంద్రీనీవా రిజర్వాయర్ల ఏర్పాటుకు కూడా చర్యలు ప్రారంభించారు. దాదాపు రూ.250 కోట్లతో నిర్మించనున్న ఉక్కు కర్మాగారానికి ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో భూమి పూజ చేశారు. ప్లాస్టిక్ పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా భూములు కేటాయించారు. ఇలా మడకశిరలోని 1,600 ఎకరాల పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకున్న విషయాన్ని జనం గుర్తు చేసుకుంటున్నారు.

రైల్వేలైన్‌పై ప్రకటన ఉంటుందా..?

మడకశిర మీదుగా ఏర్పాటు కానున్న రాయదుర్గం–తుమకూరు రైల్వేలైన్ నిర్మాణానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందించింది. భూసేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసింది. ప్రస్తుతం పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు చేసే ఈ రైల్వే లైన్ నిర్మాణంపై చంద్రబాబు ప్రకటన చేస్తారని ప్రజలంతా భావిస్తున్నారు.

పార్టీ బలోపేతానికే సీఎం పర్యటనా..?

మడకశిర నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికే సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నారని ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో మడకశిర టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు కేవలం 351 ఓట్ల మెజార్టీతో మాత్రమే గెలిచారు. అలాగే నియోజకవర్గం పార్టీ నేతలు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారుగా ఉంటున్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్థానికేతరుడు కావడం తదితర కారణాలతో పార్టీ పటిష్టం చేయాలన్న ఉద్దేశంతోనే చంద్రబాబు మడకశిర నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు తెలుస్తోంది.



అమరాపురం మండలంలో వైఎస్ జగన్ హయాంలో పూర్తి చేసిన హంద్రీనీవా కాలువ

అభివృద్ధికి కృషి చేయాలి..



మడకశిర నియోజకవర్గంపై చంద్రబాబు దృష్టి సారించాలి. వైఎస్ జగన్ తరహాలోనే అభివృద్ధి చేయాలి. మడకశిర బైపాస్ కెనాల్‌ను పూర్తి చేయడంతో పాటు నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారులన్నీ అందుబాటులోకి తేవాలి. రైలు మార్గంపై దృష్టి సారించాలి. – ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

నేడు గుండుమలకు సీఎం చంద్రబాబు

- పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చేతన్ వెల్లడి

మడకశిర రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మడకశిర మండలంలోని గుండుమలకు విచ్చేయనున్నారు. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ చేతన్, ఎస్పీ వి. రత్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం 1.45 గంటలకు సీఎం గుండుమలకు చేరుకుంటారని, మధ్యాహ్నం 2.20 గంటలకు ఎస్సీ కాలనీ చేరుకుని సామాజిక భద్రత పింఛన్లు (ఎన్టీఆర్ భరోసా) పంపిణీ చేస్తారన్నారు. గ్రామ ప్రజలతో ముఖాముఖి, కరియమ్మ ఆలయ సందర్శన ఉంటుందన్నారు. 4.35 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్తారన్నారు.



క్లుప్తంగా

పత్తి పంట పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

రొద్దం: మండలంలోని పెద్దమంతూరులో రైతు పూజారి వెంకటప్ప సాగు చేసిన పత్తి పంటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు బుధవారం పరిశీలించారు. సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలో మెగ్నీషియం ధాతు లోపం నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చు పురుగు ఆశించినట్లైతే లీటర్ నీటికి 5 ఎం.ఎల్. వేపనూనె, 0.4 ఎం.ఎల్. ఇమిడాక్లోప్రిడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ స్వయంప్రభ, ఏఓ నివేదిత, వీఏఏ యోగేష్, రైతులు పాల్గొన్నారు.

మూడు లారీలు ఢీ - ఒకరి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

పెనుకొండ రూరల్: వరుసగా మూడు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని కోలార్ నుంచి టమాట లోడుతో హైదరాబాద్‌కు బయలుదేరిన లారీ... మంగళవారం అర్ధరాత్రి పెనుకొండ మండలం కొత్తచెరువు బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో డివైడర్‌ను ఢీకొంది. అక్కడితో ఆగకుండా డివైడర్‌ను దాటుకుని ముందుకు వెళ్లిన లారీ చత్తీస్‌ఘడ్ నుంచి బెంగళూరుకు బంగాళదుంపలతో వెళుతున్న లారీని ఎదురుగా ఢీకొని ఒకదానిని మరొకటి తోసుకుంటూ వెనుకే ఉన్న కంటైనర్‌ను గుద్దుకున్నాయి. ఘటనలో కోలార్ జిల్లా మాలూరుకు చెందిన లారీ డ్రైవర్ ఎం.శ్రీనివాస్ (35) మృతి చెందాడు. స్వల్ప గాయలతో క్లీనర్ ముత్తు బయట పడ్డాడు. చత్తీస్‌ఘడ్ నుంచి బెంగళూరు వెళుతున్న లారీలో డ్రైవర్ శశికుమార్, క్లీనర్ గౌరప్పకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు శ్రీనివాస్‌కు భార్య కళావతి, ఇద్దరు కుమారులున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

పోక్సో కేసులో నలుగురి అరెస్ట్

కదిరి అర్బన్: మండలంలోని పట్నం గ్రామానికి చెందిన ఓ బాలికను మోసం చేసిన కేసులో నిందితుడు సాయికుమార్‌ను కదిరి రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం సాయికుమార్‌తో పాటు ఆయన తల్లి పద్మావతి, తండ్రి వెంకటరమణ, రామ్మోహన్‌రెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు.

ఉజ్వల భవితకు నవోదయం

- 2025-26 విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష



లేపాక్షిలోని నవోదయ విద్యాలయం

లేపాక్షి: ఉచిత విద్యతోపాటు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా, విద్యార్థుల పరిపూర్ణ వికాసానికి దోహదపడుతున్నవే... నవోదయ విద్యాలయాలు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలకు ప్రకటన విడుదలైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు లేపాక్షిలోని నవోదయలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కసారి ఆరో తరగతిలో చేరితే... 12వ తరగతి వరకూ ఉచిత విద్యను అందిపుచ్చుకోవచ్చు. అధునాతన సౌకర్యాల కల్పన, ప్రయోగాత్మక విద్య, క్రీడలు, క్రమశిక్షణ, ప్రతిభకు పెద్దపీట వేయడం లేపాక్షి నవోదయ ప్రత్యేకత.

పక్కాగా రిజర్వేషన్ల అమలు..

నవోదయలో ప్రవేశాలకు రిజర్వేషన్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం రిజర్వేషన్ ఉంటుంది. అయితే ప్రవేశ పరీక్షలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యధికంగా మెరిట్ సాధిస్తే పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించిన రిజర్వేషన్‌లోనే వారికీ సీట్లు కేటాయిస్తారు. షెడ్యూల్డు కులాలకు 15 శాతం, షెడ్యూల్డు తెగలకు 7 శాతం, దివ్యాంగులకు 3 శాతం, ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉంది. ప్రవేశాల్లో బాలికలకు 30 శాతం రిజర్వేషన్లను వర్తింపజేస్తున్నారు.

ఎంపిక విధానం ఇలా..

- ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే జేఎన్‌వీ సెలక్షన్ టెస్ట్ (జేఎన్‌వీఎస్‌టీ) మూడు విభాగాల్లో కొనసాగుతుంది.
- ఈ పరీక్ష ఆఫ్‌లైన్ పరీక్ష. పెన్ అండ్ పేపర్ విధానంలో ఉంటుంది.
- తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఏదో ఒక దానిని ఎంచుకుని పరీక్ష రాయాలి.
- మొత్తం 100 మార్కులకు సంబంధించి 80 ప్రశ్నలకు రెండు గంటల కాల వ్యవధిలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది.
- దివ్యాంగులకు 30 నిమిషాల అదనపు సమయాన్ని ఇస్తారు.
- పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్‌తో కొనసాగుతుంది.
- మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, లాంగ్వేజ్ అంశాలపై ప్రధానంగా ప్రశ్నలు ఉంటాయి.
- టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు.
- తొలి రెండేళ్లు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. అనంతరం మొత్తం ఇంగ్లిష్ మీడియంలోనే చదవాల్సి ఉంటుంది.
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకూ నామమాత్రపు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు, బాలికలకు ఫీజు నుంచి మినహాయింపు ఇస్తారు.

ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఒక్కసారే అవకాశం

వచ్చే ఏడాది జనవరి 18న నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి విద్యాలయలో ప్రవేశం లభిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. లేపాక్షి నవోదయ విద్యాలయలో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఆయా మండలాల్లో 5వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. 2025-26 విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2013, మే 1 నుంచి 2015, జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 1 నుంచి 4 తరగతి వరకూ ఉత్తీర్ణత సాధించి 5వ తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయ అనేది ఓ వరం లాంటిది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలి. ఇప్పటి వరకూ ఆన్‌లైన్ ద్వారా 140 దరఖాస్తులు అందాయి. – నాగరాజు, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయ, లేపాక్షి

‘సీఎం గారూ.. జీతాలు చెల్లించండి’

మడకశిర: విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా ఇప్పటికీ జీతాలు అందక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఎంటీఎస్ అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ‘ముఖ్యమంత్రి గారూ.. మాకు జీతాలు చెల్లించండి’ పేరుతో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ జూనియర్ కళాశాలల్లో 3,868 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు, 800 మందికి పైగా మినిమం టైం స్కేల్ అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యాసంవత్సరం ఆరంభమైన జూన్ నుంచి ఏప్రిల్ చివరి వరకూ జీతాలు చెల్లిస్తూ వచ్చింది. మే మాసానికి సంబంధించి పది రోజుల పాటు విరామం ప్రకటించి, తిరిగి అదే నెల చివరన రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తూ వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కాంట్రాక్ట్, ఎంటీఎస్ అధ్యాపకులకు తిప్పలు మొదలయ్యాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా వారికి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వకపోగా, విధుల్లో అలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఈ క్రమంలో రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని ప్రకటనలో వాపోయారు. చివరకు పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు చెల్లించడానికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఈ విషయంగా ఇప్పటికైనా సీఎం చంద్రబాబు మేల్కొని తమకు జీతాలు చెల్లించాలని కోరారు.

రైతు ప్రాణం తీసిన ఎల్‌ఎం నిర్లక్ష్యం



విద్యుత్ స్తంభంపైనే మృతి చెందిన రైతు రమణారెడ్డి

నార్పల: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఓ లైన్‌మెన్ నిర్లక్ష్యం రైతు ప్రాణాన్ని బలిగొంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... నార్పల మండలం నల్లపరెడ్డిపల్లికి చెందిన రైతు రమణారెడ్డి (55) తనకున్న 3.50 ఎకరాల పొలంలో చీనీ, వరి పంటల సాగు చేపట్టాడు. కొన్ని రోజులుగా రమణారెడ్డి పొలంతో పాటు చుట్టుపక్కల రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లకు అనుసంధానించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు తరచూ ఎగ్జిట్ ఫ్యూజ్‌లు ఎగిరి పోతుండడంతో మరమ్మతు చేయాలని సంబంధిత లైన్‌మెన్ షకూర్‌ను కోరారు. దీంతో రైతు నారాయణరెడ్డి పొలం వద్ద విద్యుత్ లైన్‌కు కంప చెట్లు తగులుతున్నాయని వాటిని తొలగిస్తే తానొచ్చి మరమ్మతులు చేస్తానని తెలిపాడు. దీంతో రమణారెడ్డి, మరికొందరు రైతులు బుధవారం సాయంత్రం కంప చెట్లు తొలగింపు పనులు చేపట్టారు. ఈ క్రమంలో రైతుల అభ్యర్థన మేరకు ఎల్‌ఎం షకూర్ ఎల్‌సీ ఇచ్చాడు. ఈ క్రమంలో రైతు లక్ష్మీదేవి పొలం వద్ద గాలికి కంపచెట్లు తగిలి విద్యుత్ లైన్ ఒకదానితో ఒకటి తగులుకోవడం గమనించిన రమణారెడ్డి స్తంభం పైకి ఎక్కి సరిచేస్తుండగా విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని కిందకు దింపారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన తండ్రి మృతిచెందాడని రమణారెడ్డి కుమారుడు నాగేశ్వరరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నీటి గుంతలో చిక్కుకుని వృద్ధుడి మృతి



మృతుడు శ్రీనివాసులు

రామగిరి: మండలంలోని పోలేపల్లి చెరువు గుంతలో చిక్కుకుని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గంధూడి శ్రీనివాసులు (78) దాదాపు 30 ఏళ్ల క్రితం కుటుంబసభ్యులను వదిలి చెర్లోపల్లి, పోలేపల్లి గ్రామాల్లోని రైతుల వద్ద పశువుల కాపరిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పశువులను మేపు కోసం పోలేపల్లి చెరువులోకి తోలుకెళ్లాడు. నీటి గుంత వైపుగా వెళుతున్న పశువులను గమనించి వాటిని పక్కకు అదలిస్తూ ప్రమాదవశాత్తూ బురదలో ఇరుక్కుపోయాడు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో కేకలు వేసినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో బురదలో నెమ్మదిగా ఆయన కూరుకపోయాడు. సాయంత్రం కేవలం పశువులు మాత్రమే ఇళ్లకు చేరుకోవడంతో అనుమానం వచ్చిన రైతులు చెరువు వద్దకెళ్లి పరిశీలించారు. గుంత వద్ద పడి ఉన్న కర్రను గుర్తించి బురదలో గాలించి వృద్ధుడిని వెలికి తీశారు. అప్పటికే ఊపిరి అందక ఆయన మృతి చెందినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో రామగిరి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సజావుగా ఆలయ భూముల వేలం

అనంతపురం కల్చరల్: అన్యాక్రాంతమైన దేవదాయ శాఖ భూముల వేలం ప్రక్రియ బుధవారం పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసింది. అనంతపురంలోని మొదటిరోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వరాలయంలో వేలం ప్రక్రియ సాగింది. ఇటుకలపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి దేవస్థానాలకు చెందిన మాన్యం భూములకు వేలం నిర్వహించి కౌలుకు ఇచ్చారు. గ్రూపు ఆలయాల ఈఓ రామాంజనేయులు, ఎండోమెంటు తనిఖీ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... పాతికేళ్లుగా ఇతరుల ఆధీనంలో ఉన్న ప్రాచీన ఆలయాలకు సంబంధించిన 44.83 ఎకరాల మాన్యం భూమి స్వాధీనం చేసుకుని వేలం నిర్వహించినట్లు వివరించారు. ఈ భూముల ద్వారా ఏడాదికి రూ.95,200 కౌలు ఆదాయం సమకూరుతోందన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై కొడవళ్లతో దాడి





తీవ్రంగా గాయపడిన నీలకంఠ, సంజీవ్

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కురుబ రామాంజనేయులు కుమారులు నీలకంఠ, సంజీవ్‌పై బుధవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రమేష్, ఆయన కుటుంబసభ్యులు కొడవళ్లు, కట్టెలతో దాడి చేశారు. నీలకంఠ తలకు తీవ్రగాయాలయ్యాయి. సంజీవ్ చెయ్యి విరిగింది. బాధితులు తెలిపిన మేరకు... గొర్రెల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్న రామాంజనేయులు... ఊరు వాకిలి సమీపంలో దొడ్డిలో రాత్రి సమయంలో గొర్రెలను విడిచేవాడు. ఆ పక్కనే ఉన్న దొడ్డిలో టీడీపీ నాయకుడు వడ్డే రమేష్ తన గొర్రెలను విడిచేవాడు. ఈ క్రమంలో దొడ్డి స్థలం విషయంగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకునేది. దీంతో కక్ష పెంచుకున్న రమేష్ వర్గీయులు అవకాశం కోసం కాచుకుని ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 7 గంటలకు గొర్రెలను దొడ్డిలో వదిలి ఇంటికి వెళుతున్న నీలకంఠ, సంజీవ్‌పై దాడికి తెగబడ్డారు. ఇద్దరి కళ్లలోకి రమేష్ ఆయన తమ్ముడు చంద్ర, కుమారుడు తిరుమలేష్ మరికొందరు కారం కొట్టి కొడవళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని కుటుంబసభ్యులు వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

నాగమణికి రక్షణ కల్పించండి

- అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్



ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ఓడీచెరువు మండలం వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యకు పాల్పడేంతగా వేధించిన ఆంజనేయులును తక్షణమే అరెస్ట్ చేసి, బాధితురాలికి సంపూర్ణ రక్షణ కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ భాగ్యరేఖ, సీడీపీఓ గాయత్రికి బుధవారం వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం మారిన ప్రతిసారి అంగన్‌వాడీ కార్యకర్తలను మార్చడం సబబు కాదన్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నాగమణిని వేధించిన ఆంజనేయులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ లీడర్లు సుజాత, మంజుల, భగవతి, షర్మిల, పద్మ, జ్యోతి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పది సిలబస్‌లో మార్పులతో విద్యార్థులకు నష్టం

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి

ధర్మవరం అర్బన్: పదో తరగతి సిలబస్ మార్పులు విద్యార్థులకు ఏ మాత్రం ఉపయోగపడేలా లేవని, దీని వల్ల విద్యార్థులకు తీరని నష్టం చేకూరుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి సాంఘిక శాస్త్రంలో 258 పేజీలు ఉంటే 167 పేజీలు యూరోపియన్ చరిత్రకే కేటాయించారన్నారు. ఇందులో రాష్ట్ర చరిత్రకు సంబంధించి అతి తక్కువ పేజీలు కేటాయించడం దారుణమన్నారు. గత ఏడాది 9వ తరగతి హిందీ పాఠ్యాంశాల్లో ఉత్తర భారతదేశం మాండలీకాలు పొందుపరిచారని, దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురయ్యారని గుర్తు చేశారు. భౌతిక రసాయన శాస్త్రంలో మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం లాంటి పాఠాలు తొలగించడం అన్యాయమన్నారు. శాస్త్ర పరమైన అంశాలను విద్యార్థులకు దూరం చేయడం సరికాదన్నారు. భవిష్యత్తు పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు ఉపయోగపడేలా గణితంలో పాఠ్యాంశాలు లేవన్నారు. ఇప్పటికైనా పాత పాఠ్యాంశాలను తిరిగి చేర్చి, పిల్లల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, రాంప్రసాద్, హరికృష్ణ, సాయి గణేష్, రామాంజనేయులు, ఆదిశేషు, జనార్దన్‌బాబు, వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

అనంతపురం: బత్తలపల్లిలోని సంజయ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం. మునిరామయ్య ఆదేశాల మేరకు బుధవారం సీఐ వి.వెంకటరమణ, వ్యవసాయాధికారి జె.వాసు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. భౌతిక నిల్వలో వ్యత్యాసాలు గుర్తించారు. స్టాక్ బోర్డు, రిజిస్టర్ నిర్వహణ సరిగా లేదని నిర్ధారించుకున్నారు. అనంతరం రూ.69,930 విలువ చేసే 92.25 లీటర్ల క్రిమిసంహారక మందుల విక్రయాలకు స్టాప్ సేల్ నోటీసులు జారీ చేశారు.

ఆత్మకూరు వద్ద హిజ్రాల దౌర్జన్యం

ఆత్మకూరు: యాచన పేరుతో కొందరు హిజ్రాలు దారి దోపిడీకి తెరలేపారు. ఒంటరిగా వాహనదారులు కనిపిస్తే జేబులో ఉన్న మొత్తం నగదు దోచేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆత్మకూరు బైపాస్‌లో ఓ వాహనదారుడు నిలువు దోపిడీకి గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పి.యాలేరు గ్రామానికి చెందిన ఓ యువకుడు అత్యవసర పనిపై బుధవారం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి బయలుదేరాడు. ఆత్మకూరు శివారులోని బైపాస్ క్రాస్ వద్ద అప్పటికే వాహనదారులను అడ్డుకుని బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్న నలుగురు హిజ్రాలు... సదరు యువకుడిని ఆపి డబ్బు ఇవ్వాలని అడిగారు. తనకు తోచినంత ఇచ్చేందుకు ఆ యువకుడు సిద్ధమవుతుండగా జేబులోని రూ.3 వేలును లాగేసుకున్నారు. దీంతో కంగుతిన్న ఆ యువకుడు తన డబ్బు ఇవ్వాలని ప్రాధేయపడినా వారు ససేమిరా అన్నారు. వారి చేష్టలతో విసుగు చెందిన బాధితుడు నేరుగా పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయడంతో కానిస్టేబుళ్లు వెంటనే అక్కడకు చేరుకున్నారు. పోలీసులను చూడగానే హిజ్రాలు పరుగుదీశారు. వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితుడి నుంచి లాక్కొన్న డబ్బును తిరిగి ఇప్పించారు. మరోసారి ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు.

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు


గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ బుధవారం చేపట్టారు. 36 రోజులకు గానూ రూ.21,78,764 లక్షల నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.18,202 నగదు, 121 అమెరికన్ డాలర్లను భక్తులు సమర్పించినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు.



వెంపలి పువ్వు



స్వర్ణక్షీర



ఎర్ర గలిజేరు

గడ్డి పూలు.. ఔషధ గుణాలు ఫుల్

పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో గడ్డి పూలు విరబూసి ఆకట్టుకుంటున్నాయి. చూడముచ్చటగా ఉన్న ఈ పూలు ఎన్నో ఔషధ గుణాలతో కూడుకున్నవని ఆయుర్వేద వైద్య నిపుణులు అంటున్నారు. ఈ పూలలోని మకరందాన్ని ఆస్వాదించేందుకు తుమ్మెదలు పోటీ పడుతుండడం గమనార్హం. మరో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే... ఈ పూల జాతి మొక్కలన్నీ అమెరికాలోని నైరుతి ప్రాంతానికి చెందినవిగా, అక్కడి నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉష్ణమండల ప్రాంతాలకు విస్తరించినట్లు వృక్ష శాస్త్ర నిపుణులు చెబుతున్నారు. – పుట్టపర్తి రూరల్:



పిల్లి తీగ



షోనా పువ్వు



జుమికి పువ్వు



జత్రోఫా గాసిపిఫోలియా

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ AP EAPCET లో క్వాలిఫైడ్ స్టూడెంట్స్ కీ బి. ఫార్మసీ, B.SC (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. జి.మురళి, 9030661651, ATP. [A-253]

B.Tech మేనేజ్‌మెంట్ అడ్మిషన్స్

■ AP EAPCET క్వాలిఫై కాని వారికి, ఎంట్రెన్స్ రాయని స్టూడెంట్స్ కి కాలేజీ ఫీజు ఉండదు. Only హాస్టల్ ఫీజు కట్టుకోవలెను. జి.మురళి, 9030661651, అనంతపురం. [A-254]

DMLT ADMISSIONS

■ DMLT 2 సం॥ల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. మా కాలేజ్ నందు స్టేట్ ర్యాంకులు 1st & 6th to 14th వరకు. # SEEDS కాలేజ్, కమలానగర్, ATP. 9440255034. [A-1297]

REAL ESTATE

TOLET

■ ATP, సూర్యనగర్ మలబార్ గోల్డ్ షాప్ ఎదురుగా, ఉషా మెషిన్ల షాపు ఎదురు సందులో ముంతాజ్ మంజిల్ మొదటి అంతస్థులో 1 BHK ఇల్లు, నీరు, లిఫ్ట్ వసతితో అద్దెకు కలదు. సంప్ర: 98493 97509. [A-1302]

ప్లాట్లు అమ్మబడును

■ అనంతపురము టౌన్ మారుతీనగర్, గణేష్ హోటల్ వెనుక, నవయుగ ఎస్టేట్స్ వారు కొత్తగా ప్రారంభించిన సమృద్ధి అపార్ట్‌మెంట్ నందు డూప్లెక్స్ మరియు కొన్ని ప్లాట్లు మాత్రమే అమ్మకమునకు కలవు. కావలసినవారు సంప్రదించండి. సెల్ : 9440266241. [A-6317]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6525]

WANTED

■ అనంతపురం ప్రముఖ బ్యాంక్ నందు పనిచేయుటకు Gunman కావలెను. Age under 58. సంప్రదించండి. Cell : 9440087632,8341006131. [A-1303]

■ అనంతపురంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజ్ నందు పనిచేయుటకు Tutors (P.G పూర్తి అయిన వారు),Wardens, Mess Workers, Sweepers కావలెను. సెల్: 9866117303, 9908823351. [A-7040]

■ ప్రముఖ జయలక్ష్మి మారుతి కార్ల డీలర్ షిప్ నందు అనంతపురం జిల్లాలో పనిచేయుటకు డిగ్రీ చదివిన & ఆటో మొబైల్స్ నందు అనుభవంకల్గిన షోరూం మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సెల్ : 9154333982 [A-762349]

■ Job Vacancy : YIP PVT LTD. Age : 18 to 45 Yrs. Qual. : 10th to Any Degree, Salary : 18000/- to 25000/- (Work From Home Available). ✆ 89789 45341. [M-1185373]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 8121818692. [M-1185372]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌసేకీపింగ్ భార్యా భర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.